
ప్రజాశక్తి
సోమవారం 6 ఫిబ్రవరి 2023
5
విజయనగరం



హైమోస్ట్ విద్యుత్తు దీపాలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



హైమోస్ట్ విద్యుత్తు దీపాలు ప్రారంభిస్తున్న ఆశపు వేణు

నగరంలోని కన్యకా పరమేశ్వరి కోవెల జంక్షన్, సిటీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన హైమోస్ట్ విద్యుత్తు దీపాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లో కోలగట్లకు ఘనస్వాగతం లభించింది. నాలుగు రోడ్ల కూడళ్లు కావడంతో వాహనదారులకు, పాదచా రులకు విద్యుత్తు దీపాలు ఎంతగానో ఉపయోగపడనున్నాయని కోలగట్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతిదేవి, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు నారాయణం శ్రీనివాసరావు, పార్టీ నాయకులు ఎడ్ల రాజేష్, కేదారశెట్టి లక్ష్మణ్. తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఏజెంట్‌లా ఎపిసి

సమగ్ర శిక్ష ఎపిసి వి.అప్పలస్వామినాయుడు వైసిపి ఏజెంట్ మాదిరిగా వ్యవహరించారు. బాధ్యత కలిగిన హోదాలో ఉన్న ఉన్నతాధికారి అక్రమాల అధికార పార్టీ కార్యకర్తలాగే పనిచేశారు. ప్రభుత్వ సెలవుదినం రోజున అధికారిక సమావేశం ఉంటుందంటూ కెజిబివి ఎస్ఒలు, టీచర్లు, సిబ్బందిని పిలిచారు. ఆ సమావేశంలో అనూహ్యంగా వైసిపి బలపర్చిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రత్యక్షమయ్యారు. తను గెలిపిస్తే సమస్యలన్నీ పరిష్కరించేస్తానంటూ ప్రగల్భాలు పలకడంతో అక్కడ ఆశీనులైన ఉద్యోగులంతా అవాక్కయ్యారు. తీరా ఎపిసి ఎక్కడయ్యా? అంటే ఆ దరిదాపుల్లో కనిపించలేదు. అదే సముదాయంలోని మరో భవనంలోని ఒకగదిలో ఆయన దాక్కుండిపోయినట్టు తెలియడంతో అక్కడికి చేరిన వందలాది మంది టీచర్లు, సిబ్బందికి హైడ్రామా మొత్తం అర్థమైంది. దీంతో, అక్కడి నుంచి అంతా ఒక్కసారిగా బయటకు వచ్చేశారు. ఇదా ఈయన గారి బండారం! అంటూ ఎపిసి స్వామినాయుడు వ్యవహారశైలిపై చర్చలో చర్చలు నడిచాయి. ఎపిసికి శాపనార్థాలు పెట్టుకుంటూ వెనుదిరిగారు.

- సమావేశం పేరిట కెజిబివి ఎస్ఒలు, టీచర్లు, సిబ్బందికి పిలుపు
- తీరా అందరూ వచ్చాక ముఖం చాటేసిన వైనం
- అనూహ్యంగా వేదికపై ప్రత్యక్షమైన వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి
- తనను గెలిపించాలంటూ వేడుకోలు
- తిట్టుకుంటూ వెనుదిరిగిన కెజిబివి సిబ్బంది
- భోజనం చేసేందుకూ నిరాకరణ
- జిల్లా పరిషత్తు వేదికగా హైడ్రామా




జెడ్‌పి సమావేశ మందిరం ఎదుట ఎపిసికి వ్యతిరేకంగా చర్చించుకుంటున్న కెజిబివి టీచర్లు, సిబ్బంది

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సమయం ఆదివారం ఉదయం 10.30 గంటలు కావస్తోంది. జిల్లా నలుమూల నుంచి కెజిబివి స్పెషల్ ఆఫీసర్లు, అందులో పనిచేస్తున్న సిఆర్‌టి, పిజిటిలతోపాటు బోధనేతర సిబ్బంది గుంపులుగుంపులుగా వస్తున్నారు. అందరి దారీ జిల్లా పరిషత్తు వైపే. చర్చంతా సమావేశంపైనే. ఇంతకీ ఏమిటా సమావేశం?.. మునుపెన్నడూ లేనిది టీచర్లందర్నీ ఒకేసారి ఎందుకు పిలిచారు?.. కార్యాలయ సిబ్బందిని కూడా విడిచిపెట్టలేదు! అందులోనూ ఆదివారం, ఇంత అర్జెంటు ఏమై ఉంటుందో?.. ఇంత ప్రాధాన్యత దేనికై ఉంటుందో?.. ఇలా ఎన్నో ప్రశ్నలు, మరెన్నో సందేహాల నడుమ తీవ్ర ఉత్కంఠతో వందలాది మంది జిల్లా పరిషత్తు ప్రాంగణానికి చేరుకున్నారు. అప్పటికే ఎపిసి పురమాయించిన కొంతమంది వ్యక్తులు కెజిబివిల నుంచి వచ్చిన వారందరికీ జెడ్‌పి సమావేశ మందిరంలోకి సాదర స్వాగతం పలుకుతున్నారు. లోపలికి వెళ్లాక టీ, స్నాక్స్ వంటి వాటితో సకల మర్యాదలకు సిద్ధమౌతున్నారు. అప్పటికే కొంతమంది టీచర్లకు అనుమానం వచ్చింది. ఎప్పుడు తిట్లపురాణం, చీదరింపులు, హెచ్చరికలతో మొదలయ్యే సమావేశం ఈసారి 'అయ్యగారు' రాకముందే ఇన్ని మర్యాదలేంటబ్బా? అని!. స్వామినాయుడు ఎంతకీ కాకపోవడంతో అనుమానాలు పెనుభూతాలుగా మారుతున్నాయి. సరిగ్గా అదే సమయంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికకు వైసిపి బలపర్చిన అభ్యర్థి సుధాకర్ ఎంట్రీ ఇచ్చారు. దీంతో, చాలా మంది అవాక్కయ్యారు. మరికొంతమంది ఊహించినట్టే జరిగిందంటూ అసలు విషయం అర్థం చేసుకున్నారు. ఇంతకీ అయ్యగారి ఆచూకీ ఎక్కడ? ఎటు చూసినా ఎపిసి కనిపించలేదు. అంతలోనే అభ్యర్థి తన పరిచయ ప్రసంగాన్ని ప్రారంభించారు. ఎప్పుడూ ఆయన ముఖం చూడలేదే! అంటూ కొందరు? ఓహో ఇందుకేనా ఇంత డ్రామా? అంటూ మరికొందరి గుసగుసలు. అంతలోనే తేరుకున్న ఆ అభ్యర్థి తనను గెలిపిస్తే ప్రభుత్వంతో పోరాడి కెజిబివి టీచర్లు, సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తానంటూ హామీలు గుప్పించారు. దీంతో, ఇప్పటివరకు 'మా కోసం గానీ, ప్రభుత్వ ఉద్యోగుల కోసం గానీ చేసిందేమైనా? ఉందా? ఇంతవరకు సార్ వారు ఎన్ని పోరాటాలు చేశారో? ప్రభుత్వం మీద' అంటూ ఒకరికొకరు చలోక్తులు. అప్పటికీ అభ్యర్థి వేడుకోలు విరమించుకోకపోవడంతో మీటింగ్ హాల్ నుంచి ఒక్కొక్కరుగా బయటకు వచ్చేశారు. దీంతో, మమ.. అంటూ మంగళం పాడడం ఆయనగారి వంతైంది. బయటకు వచ్చాక భోజనాలు ఏర్పాటు చేశామంటూ నిర్వాహకులు పిలిచినప్పటికీ కెజిబివి సిబ్బంది నిరాకరించారు. 'చాలు చాల్లేండి... మీ భోజనాలు, మీరూను! మీటింగ్ అంటే అర్థం పర్థం ఉండాలి!' అంటూ కసురుకున్నారు. ఆదివారం కూడా చావగొట్టారు. రాకపోతే ఛార్జిమెమోలు ఇస్తారో, లేక సస్పెండ్ చేస్తారో? అనే మాట ఎక్కువ మంది నోట వినిపించింది. రాత్రి డ్యూటీ చేసుకుని తెల్లవారి ఉరుకులు పరుగులతో వచ్చామంటూ ఇంకొందరు.. ఇలా వారి ఇబ్బందులంతా ఒకరికొకరు పంచుకున్నారు. అనంతరం అక్కడి నుంచి వెనుదిరిగారు.

ఈ సంగతి కాస్త అటుంచితే వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారానికి సమగ్ర శిక్ష ఎపిసి అప్పలస్వామినాయుడు తన అధికారాన్ని దుర్వినియోగం చేయడంపై కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతోపాటు ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. సిఐటియు నాయకులు ఎపిసిని సస్పెండ్ చేయాలని కూడా ప్రకటన విడుదల చేశారు. వైసిపి గెలుపుపై నమ్మకం లేక ఇలాంటి అధికారులను ఉపయోగించుకుని ఇలాంటి దొడ్డిదారి మీటింగులు ఏర్పాటు చేస్తోందని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.



All The Principals

Meeting will be conducted for KGBV, SOs , CRTs and PGTs who are in Contact and Outsourcing on Sunday at 10.00 am at ZP Meeting Hall.

Meeting 11 to 12 followed by Lunch.... Principals are ensure to attend 100% staff from your Institution CRT and PGT , PET, CI , VI and Accountants of Contract and Out Sourcing Only.

Sunday Duty Teacher No Need to Attend

As per APC sir instructions who have tomorrow grand test that teacher attending to holiday duty.

All the Principals make sure that all of your staff attended at the venue by 10.45am ....Meeting will be sharply closed by 12.00pm....Remind your staff regarding

Who have attended duty remaining staff attended meeting compulsory they will be answer to APC sir

మోటివేషన్, రీ ఓరియంటేషన్ పేరుతో పంపించిన వాట్సాప్ మెసేజ్‌లు

మోటివేషన్, రీ ఓరియంటేషన్ పేరిట ఆహ్వానం

మోటివేషన్, రీ-ఓరియంటేషన్‌పై ఆదివారం ఏర్పాటు చేయబోయే సమావేశానికి కెజిబివి స్పెషల్ ఆఫీసర్లు, అందులో పనిచేస్తున్న సిఆర్‌టి, పిజిటిలతోపాటు బోధనేతర సిబ్బంది కూడా హాజరు కావాలంటూ సమగ్ర శిక్ష ఎపిసి వాట్సాప్ మెసెజ్‌లు పంపారు. గంటలో సమావేశం ముగిస్తామని, మధ్యాహ్నం భోజనాలు కూడా ఉంటాయని అందులో పేర్కొన్నారు. అందరూ హాజరయ్యే విధంగా స్పెషల్ ఆఫీసర్లు బాధ్యత తీసుకోవాలని కూడా సూచించారు.

ఎపిసిని సస్పెండ్ చేయాలి

రాజకీయ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్నికల ప్రచారానికి సమావేశం ఏర్పాటుచేసిన సమగ్ర శిక్ష ఎపిసి వి.అప్పలస్వామినాయుడును ఉన్నతాధికారులు వెంటనే సస్పెండ్ చేయాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శంకరరావు, కె.సురేష్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ఉద్యోగుల మనోభావాలను కూడా దెబ్బతీశారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో ఆదివారం సమావేశం పెట్టడమే సరికాదని, అందులోనూ ఒక పార్టీ రాజకీయ లబ్ధికోసం పెట్టడం ఎంతో నేరమని పేర్కొన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కలెక్టర్, సమగ్ర శిక్ష ఎస్‌పిడి, విద్యాశాఖ కమిషనర్ వెంటనే స్పందించాలని విజ్ఞప్తి చేశారు.



సంకల్ప దీక్షలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

సిపిఎస్ రద్దు చేయాల్సిందే

- ఒపిఎస్‌ను పునరుద్ధరించే వరకూ పోరాటం ఆగదు : యుటిఎఫ్
- కలెక్టరేట్ ఎదుట సంకల్ప దీక్ష

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సిపిఎస్‌ను రద్దు చేసి, ఒపిఎస్‌ను పునరుద్ధరించే వరకూ పోరాటం సాగిస్తామని యుటిఎఫ్ నాయకులు తెగేసిచెప్పారు. యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు విజయనగరం కలెక్టరేట్ వద్ద సిపిఎస్‌ను రద్దుచేయాలని యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సంకల్ప దీక్ష చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని సిపిఎస్ సబ్‌కమిటీ జిల్లా కన్వీనర్ సిహెచ్ తిరుపతి నాయుడు అధ్యక్షతన నిర్వహించారు. దీక్షనుద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, డి.రాము, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్‌చంద్ర పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్‌ను రద్దుచేసి, పాత పింఛను స్కీమ్‌ను అమలు చేస్తామని సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు హామీనిచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి సుమారు నాలుగేళ్లవుతున్నా ఇంతవరకు సిపిఎస్‌ను రద్దు చేయలేదని, పైగా, ఇప్పుడు జిపిఎస్ పేరుతో కొత్త నాటకానికి తెరదీస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో జిపిఎస్‌ను ఆమోదించుకోవాలని ప్రభుత్వం చూస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు జిపిఎస్ ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదని స్పష్టంచేశారు. రాజస్థాన్, చత్తీస్‌గడ్, జార్ఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో హామీనివ్వకుండానే సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్‌ను అమలు చేశారని తెలిపారు. హామీ ఇచ్చిన సిఎం జగన్ మాట తప్పడం సరికాదన్నారు. ఇప్పటికైనా సిపిఎస్‌ను రద్దుచేసి, ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. లేకుంటే భవిష్యత్తులో కలిసొచ్చే సంఘాలతో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజాస్వామ్య బద్ధంగా పోరాటం చేసే హక్కును కాలరాసేలా ప్రభుత్వం జిఒ 1ను తీసుకొచ్చిందన్నారు. ఆ జిఒని అడ్డుపెట్టుకొని ప్రభుత్వం రోడ్డుపైకి ఎవరినీ రాకుండా, పోరాటాలు చేయకుండా నిర్బంధాలను విధించి అక్రమంగా అరెస్టు చేస్తోందని ధ్వజమెత్తారు. వెంటనే జిఒ 1ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సంకల్ప దీక్షలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె శ్రీనివాసరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎ.సత్యశ్రీనివాస్, సహాధ్యక్షులు వి.ప్రసన్నకుమార్, రాష్ట్ర కౌన్సిలర్ కె.అప్పారావు, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, కేశవ, సూర్యారావు, జి.రాజారావు, ఎ.శంకరరావు, వి.రాధాభవాని, జిల్లా నాయకులు జి.నిర్మల, శశికళ, పి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధించుకోగలం

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధించుకోగలమని నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు మువ్వల గంగా ప్రసాద్ రావు అధ్యక్షతన ఆదివారం సంఘం కార్యాలయంలో నిర్వహించారు. అనంతరం విజయనగరం నగర, తాలూకా కార్యవర్గంలో, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ భవనం కమిటీ చైర్మన్ ఖాళీలను భర్తీచేశారు. నగర అధ్యక్షులుగా ఎం.మంగరాజు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ భవనం అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా చందక శ్రీనివాసరావును నియమించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఎం.శ్రీను, సహాయకార్యదర్శి ఎస్.సూర్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.సూరిబాబు, బి.పైడితల్లమ్మ, పట్టణ కార్యదర్శి జి.రమేష్, పట్టణ కోశాధికారి జి.అప్పారావు పాల్గొన్నారు.

క్రీడా వసతుల ఏర్పాటులో ముందుంటా : కోలగట్ల

విజయనగరం టౌన్ : క్రీడాకారులు, యువతకు కావాల్సిన క్రీడా వసతులు ఏర్పాటు చేసేందుకు ఎప్పుడూ ముందుంటానని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఆదివారం నగరంలో రాజీవ్ స్టేడియంలో రిటైర్డ్ ఆర్మీ జవాన్ దాసరి రామారావు ఆధ్వర్యాన ఉచితంగా దేహదారుఢ్య శిక్షణ పొందిన 75 మందిలో 74 మంది రైల్వే ఉద్యోగ ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించారు. ఈ నేపథ్యంలో రామారావు ఆధ్వర్యాన వారంతా ఆదివారం కోలగట్ల నివాసంలో ఆయన్ను కలిశారు. శిక్షణకు సహకరించిన కోలగట్లకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. రామారావును కోలగట్ల అభినందించారు.





కొండపైకి వెళ్తున్న యాత్రికులు ; జాతరకు హాజరైన జనం

వ్యాకులమాత జాతరకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని కొండడాబాలు వద్ద ఆదివారం నిర్వహించిన వ్యాకులమాత జాతరకు ఈ ఏడాది యాత్రికులు పోటెత్తారు. ఉత్తరాంధ్రతోపాటు రాష్ట్ర, దేశ నలుమూలల నుంచి యాత్రికుల తాకిడి పెరిగింది. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే వ్యాకులమాత జాతర ఏటా ఫిబ్రవరి నెల మొదటి ఆదివారం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ జాతరకు శనివారం రాత్రే యాత్రికులు వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొండడాబాలు విచారణ కర్త గొంగాడ రాజు, ఉత్సవ కమిటీ సభ్యులు జాతర ప్రాంగణంలో యాత్రికులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. వ్యాకులమాత స్వరూపం, 33.5 అడుగుల ఎత్తయిన క్రీస్తు విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు. జాతరలో ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆయనతో పాటు కొత్తవలస సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, ఇతర పెద్దలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతరలో పాల్గొనడం ఆనందంగా ఉందని చెప్పారు.

జాతరకు పటిష్ట బందోబస్తు

వ్యాకులమాత జాతరకు 150 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. సిఐ ఎస్.బాలసూర్యారావు శని, ఆదివారాలు రెండు రోజుల పాటు ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూసుకున్నారు. ఎస్.కోట, విశాఖపట్నం నుంచి కొండడాబాల వరకు ఆర్‌టిసి ప్రత్యేక సర్వీసులు నడిపింది.

విశ్వనాథ్‌కి ఘన నివాళి

ప్రజాశక్తి-విజయనగరం

కళాతపస్వి కె.విశ్వనాథ్ సంస్మరణ సభను సత్యా విద్యాసంస్థల ఆధ్వర్యంలో సీతం కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేశారు. ముఖ్యవక్తలుగా విజయభావన సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు, ఆత్రేయ స్మారక కళాపీఠం వ్యవస్థాపకులు ఉసిరికుల చంద్రశేఖర్, ఘంటసాల సంగీత సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకులు సముద్రాల గురుప్రసాద్ హాజరై, విశ్వనాథ్ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. విద్యార్థినీ విద్యార్థులు విశ్వనాథ్ సినిమాల పాటలను పాడారు.

ముఖ్యవక్తలు మాట్లాడుతూ విశ్వనాథ్ లాంటి మహనీయులు ఎందరికో ఆదర్శమన్నారు. అటువంటి గొప్ప వ్యక్తిని మనం కోల్పోవడం సినిమా పరిశ్రమకే కాక అందరికీ తీరనిలోటని పేర్కొన్నారు. అనంతరం కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను, అనేక సామాజిక సమస్యలను ప్రధాన అంశంగా తీసుకొని విశ్వనాథ్ సినిమాలు నిర్మించారన్నారు. అంతరించిపోతున్న భారతీయ కళలను తర్వాతి తరానికి తెలియజేయాలని ఆయన నిరంతరం శ్రమించారని కొనియాడారు. విద్యార్థులు ఇటువంటి గొప్ప వ్యక్తుల గురించి తెలుసుకొని స్ఫూర్తిని పొంది ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.

కార్యక్రమంలో సత్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి సాయి దేవమణి, కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ ఎం.సత్యవేణి, సిఎస్ఒ సత్యనారాయణ, పీడీ మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'బాలాజీ'లో టెన్త్ విద్యార్థులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - గజపతినగరం

మండలంలోని మరుపల్లి బాలాజీ పాలిటెక్నిక్ కాలేజీలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు ఆదివారం ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు అవగాహన కల్పించారు. ఈ కళాశాలలో నిర్వహించిన మోడల్ పాలీటెస్ట్‌కు గజపతినగరం, మెంటాడ, దత్తిరాజేరు, విజయనగరం తదితర మండలాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలనే అంశంపై ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఎం.సతీష్, దొందల జట్లీ అవగాహన కల్పించారు. సాంకేతిక విద్య ఆవశ్యకత, ఉపాధి అవకాశాలు, కెరిర్ గైడెన్స్ అనే అంశాలపై కూడా అవగాహన కల్పించారు. వీరిని బాలాజీ పాలిటెక్నిక్ కాలేజీ చైర్మన్ రెడ్డి చంద్రశేఖర్, డైరెక్టర్ రెడ్డి పావని అభినందిచారు.


3 రైతుబజార్లు మంజూరు

- ఆర్‌అండ్‌బి, దాసన్నపేట బజార్ల ఆధునికీకరణ
- స్వయాభివృద్ధి కోసమే స్టాళ్లపై అద్దెలు
- మార్కెట్ కమిటీ ద్వారా రూ.35 కోట్ల ఆదాయం
- సివిల్ సప్లై బకాయి రూ.20 కోట్లు
- 'ప్రజాశక్తి'తో మార్కెటింగ్ శాఖ ఎడి శ్యామ్‌కుమార్ ముఖాముఖి



జిల్లాలో కొత్తగా మూడు రైతుబజార్లు ఏర్పాటు కానున్నాయని, మరో రెండు బజార్లు ఆధునికీకరణ చేస్తున్నామని మార్కెటింగ్ శాఖ ఎడి శ్యామ్‌కుమార్ తెలిపారు. రైతుబజార్లు సొంతంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతోనే రైతులకు కొత్తగా అద్దె విధింపు, వ్యాపారులకు అద్దె పెంపు వంటివి చేపట్టామని స్పష్టం చేశారు. జిల్లాలోని మార్కెట్ కమిటీలకు ఏటా రూ.30 కోట్ల నుంచి రూ.35 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.10 కోట్ల ఆదాయం చేతికి అందిందని, మరో రూ.20 కోట్ల మేర ధాన్యం కొనుగోలుపై సివిల్ సప్లై విభాగం నుంచి అందాల్సి ఉందని వివరించారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు..

- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి



? జిల్లాలో ఎన్ని రైతు బజార్లు ఉన్నాయి?.

జిల్లా వ్యాప్తంగా మొత్తం ఏడు రైతుబజార్లు ఉన్నాయి. వీటిలో విజయనగరంలో ఆర్‌అండ్‌బి జంక్షన్, దాసన్నపేట, పాత మహారాజా ఆసుపత్రి ప్రాంతాల్లో మూడు, ఎస్.కోట, చీపురుపల్లి, గంట్యాడ మండలం కొటారుబిల్లి, రాజాంలో చెరొకటి చొప్పున ఉన్నాయి.

? కొత్తగా రైతు బజార్లు ఏమైనా ఏర్పాటుచేస్తున్నారా?.

ఔను! జిల్లాలో చీపురుపల్లి, గరివిడి, భోగాపురంలో కొత్తగా ఏర్పాటు చేయనున్నాం. ఇందుకోసం రూ.75 లక్షల చొప్పున ప్రభుత్వం కేటాయించింది. చీపురుపల్లిలో ఇప్పటికే ఒక రైతుబజారు ఉన్నప్పటికీ ఊరికి దూరంగా మార్కెట్ యార్డులో ఉండడం వల్ల అందరికీ అందుబాటులో లేదు. తాజాగా పట్టణ నడిబొడ్డున తహశీల్దార్ కార్యాలయం వెనుక ఏర్పాటు చేస్తున్నాం. గరివిడిలో ప్రధాన రహదారికి ఆనుకునే ఉంటుంది. చీపురుపల్లి, గరివిడిలో ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. భోగాపురంలో జాతీయ రహదారికి ఆనుకుని వాటర్ ట్యాంకు సమీపంలో ఏర్పాటు చేస్తున్నాం.

? రైతుబజార్ల నిర్వహణ ఎలా ఉంది?.

ప్రతి రైతు బజారులోనూ ఎస్టేట్ ఆఫీసర్, సెక్యూరిటీ, స్వీపర్, సహాయకులు ఉంటారు. వీరి వేతనాలతోపాటు విద్యుత్ ఛార్జీలు, తదితర ఖర్చులు ఉంటాయి. వీటన్నింటికీ కలిపి ప్రస్తుతం జిల్లాలోని ఏడు రైతుబజార్లకు ఏటా సుమారు రూ.35 లక్షల నుంచి 40 లక్షల వరకు ఖర్చు అవుతుంది.

? రైతుబజార్ల నిర్వహణకు నిధులు ఎలా వస్తాయి?.

గతంలో రైతుబజార్ల నిర్వహణను స్థానిక మార్కెట్ కమిటీలే చూసుకునేవి. ఏటా ఇందుకోసం కొంత మొత్తం జెసి పర్యవేక్షణలో కేటాయించేవారు. మార్కెట్ యార్డులపై ఆధారపడకుండా రైతు బజార్లు కూడా సొంతంగా ఆర్థికాభివృద్ధి చెందాలని ప్రభుత్వం నిర్ణయించింది.

? అద్దె విధింపునకు ప్రాతిపదిక ఏమిటి?.

అద్దె అనేది సంబంధిత రైతుబజారులో క్రయ, విక్రయాలు, డిమాండ్‌ను బట్టి ఉంటుంది. అందులోనూ రోజూ విక్రయించే వారికి ఒక మాదిరి, రోజు విడిచి రోజు, అంతకన్నా ఎక్కువ రోజులు విరామం తీసుకుంటున్న వారికి మరో మాదిరిగా అద్దెలు ఉంటాయి. ఇక డ్వాక్రా సంఘాల ద్వారా స్టాళ్లు పొంది వ్యాపారాలు చేసుకుంటున్నవారికి అద్దె పెంచాం. ఆర్‌అండ్‌బి రైతు బజారులో రైతులకు రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు చొప్పున అద్దె విధించాం. గతంలో రూ.1500 అద్దె చెల్లించే వ్యాపారులు ప్రస్తుతం రూ.3 వేలు చెల్లిస్తున్నారు. ఇలా సమకూరిన మొత్తంతోనే రైతు బజార్ల నిర్వహణ ఉంటుంది.

? స్వయాభివృద్ధి ఎలా సాధ్యం?.

ఇందుకోసం రైతుల నుంచే నామమాత్రపు అద్దెలు వసూలు చేస్తున్నాం. గతంలో రైతులకు అద్దెలు ఉండేవి కాదు. విజయనగరంలోని ఆర్‌అండ్‌బి రైతుబజారులో 70 స్టాళ్లు ఉన్నాయి. వీటిలో 40పైగా రైతులకు కేటాయించాం. మిగిలినవి డ్వాక్రా సంఘాల ద్వారా చిరువ్యాపారాలు చేసుకునేందుకు కేటాయించాం. రైతులు తాము పండించిన కూరగాయలతోపాటు కొన్ని కొనుగోలుచేసి, విక్రయించే వారికి ఏడాదిగా అద్దెలు వసూలు చేస్తున్నాం. డ్వాక్రా సంఘాల ద్వారా స్టాళ్లు పొంది వ్యాపారాలు చేసుకుంటున్నవారికి అద్దెలు పెంచాం. ఇలా కొంత మొత్తం సమకూరుతుంది.

? జిల్లాలో ఎంసిలు ఎన్ని, ఆదాయం ఏమేరకు వస్తోంది?.

జిల్లాలో మొత్తం 10 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులపై ఒక్కశాతం ఫీజు మార్కెట్ కమిటీలకు వస్తుంది. ప్రధానంగా వరి, మొక్కజొన్న, పత్తి, మినుములు, పెసలు, అరటి తదితర వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులపై ఒక్క శాతం ఆదాయం వస్తుంది. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.10 కోట్ల ఆదాయం వచ్చింది. ధాన్యం కొనుగోలుపై సివిల్ సప్లై నుంచి సుమారు రూ.20 కోట్ల వరకు ఇంకా రావాల్సి ఉంది.

అద్దె విధింపునకు ప్రభుత్వ ఉత్తర్వులేమైనా ఉన్నాయా?.

2021 నవంబర్ 21న అద్దె విధింపుపై ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఉత్తర్వులు వచ్చాయి. 2022 జనవరి నుంచి అమలు చేస్తున్నాం. రైతు బజార్లు సొంతంగా ఆర్థికాభివృద్ధి చెందాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కేంద్ర ప్రభుత్వం చేసిన వ్యవసాయ చట్టాలు అమలైతే వ్యవసాయ మార్కెట్ యార్డుల వెలుపల జరుగుతున్న క్రయవిక్రయాలపై మార్కెట్ కమిటీలకు ఫీజు పొందే అవకాశం ఉండదు. దీంతో ఆదాయం తగ్గే అవకాశముంది. ఈ నేపథ్యంలో ముందుగానే రైతు బజార్లు సొంత బలంతో మనుగడ సాగించాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

? రైతుబజార్ల ఆదాయం ఎంత వస్తుంది?

జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏడు రైతు బజార్లలో గతంలో వ్యాపారుల ద్వారా నెలకు రూ.2 లక్షల ఆదాయం వచ్చేది. ప్రస్తుతం అది రూ.4 లక్షలకు పెరిగింది. గతంలో రైతుల నుంచీ ఏమీ రాలేదు. ప్రస్తుతం రూ.1.50 లక్షల వరకు వస్తోంది. ఈ మొత్తం నేరుగా రాష్ట్ర స్థాయిలోని రైతుబజార్ల సిఇఒ ఖాతాకు జమవుతుంది. అక్కడి నుంచి రైతుబజార్లన్నింటికీ కేటాయింపులు ఉంటాయి.

? రైతు బజారు సిబ్బంది జీతభత్యాలు ఏమైనా పెరిగాయా?.

కొద్ది నెలల క్రితమే పెరిగాయి. ఎస్టేట్ ఆఫీసర్ జీతం రూ.19,500 నుంచి రూ.24 వేలకు పెరిగింది. సెక్యూరిటీ, స్వీపర్లకు రూ.12 వేల నుంచి రూ.15వేలకు పెరిగాయి. విజయనగరంలోని ఆర్‌అండ్‌బి, రింగురోడ్డు రైతుబజార్లు ఆధునికీకరణ జరుగుతున్నాయి.

పుణ్యగిరి యాత్రికులకు పులిహోర, మజ్జిగ

శృంగవరపుకోట : మహా శివరాత్రికి పుణ్యగిరి కొండకు విచ్చేసే భక్తులకు పుణ్యగిరి వాకర్స్ క్లబ్ ద్వారా పులిహోర, మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు వాకర్స్ క్లబ్ గౌరవ సలహాదారు ఎ.మల్లేశ్వరరావు, అధ్యక్ష, కార్యదర్శులు బుగత వెంకటేశ్వరరావు, డబ్ల్యు.ఎన్.శర్మ, కోశాధికారి సిహెచ్ సుబ్బారావు, ఉపాధ్యక్షులు రాయవరపు అప్పలనాయుడు, మోపాడ వెంకటరమణ తెలియజేశారు. పట్టణంలోని పుణ్యగిరి వాకర్స్ క్లబ్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో మల్లేశ్వరరావు మాస్టారు మాట్లాడుతూ పుణ్యగిరి వాకర్స్ క్లబ్ సభ్యులంతా మహాశివరాత్రికి పుణ్యగిరికి వచ్చే భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ వంటి సేవా కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఎ.జె.పాలెంలో కంటి వైద్య శిబిరం

వేపాడ : మండలంలోని అంకాజోస్యులపాలెం గ్రామంలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి నిర్వహించింది. ఈ కంటి వైద్య శిబిరాన్ని ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావు ప్రారంభించారు. ఇందులో భాగంగా 108 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఇందులో 29 మందిని కంటి ఆపరేషన్స్‌కు ఎపంకి చేశారు. ఈ కార్యక్రమంలో సూరెడ్డి బాబురావు మాస్టార్, వైస్ చైర్మన్ సింగంపల్లి అర్జున, భోజంకి శ్రీను జెసిఎస్ కన్వీనర్ కిల్లి నూకరాజు, ట్రస్ట్ సభ్యులు, అంకాజోస్యుల పాలెం యూత్, శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

10 నుంచి జనసేన సభ్యత్వ నమోదు

పూసపాటిరేగ : ఈ నెల 10 నుండి 28 తేది వరకూ గ్రామాల్లో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షులు జలపారి శివ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని జనసేన కార్యాలయంలో జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యచరణపై సీనియర్ నాయకులు బూర్లె విజయశంకర్ అధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రియా శీలక సభ్యత్వ నమోదు జరగనున్న నేపథ్యంలో ప్రతి పంచాయతీకి కనీసం ఒక సభ్యత్వ నమోదు వాలంటీరు ఉండేటట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నియోజకవర్గానికి వంద మందికి తగ్గకుండా జనసైనికులకు అవకాశం కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. మూడవ విడత సభ్యత్వ నమోదు ప్రక్రియ క్షేత్ర స్థాయికి మరింత చేరువయ్యేలా తీసుకెళ్లబోతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో నెల్లిమర్ల, డెంకాడ, భోగాపురం పూసపాటిరేగ మండల అధ్యక్షులు పతివాడ అచ్చెన్నాయుడు, పతివాడ కృష్ణవేణి, వందనాల రమణ, మత్స్యకార విభాగ కార్యదర్శి కారి అప్పలరాజు, నాయకులు బలభద్రుని జానకీరామ్, దుక్క అప్పలరాజు, మాదేటి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లమ్మ ఆలయానికి శంకుస్థాపన


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస : మండలంలోని ముసిరాంలో పైడితల్లి అమ్మవారి గుడి నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస రావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘు రాజు శంకుస్థాపన చేశారు. సీతారామ శాస్త్రి మంత్రోత్సరణ నడుమ అంగరంగ వైభవంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అమ్మవారి గుడిల నిర్మాణాలు శరవేగంగా జరగాలని కోరారు. గ్రామస్తులు ఐక్యమత్యంతో నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే తుమ్మికాపల్లి గుడి ప్రారంభోత్సంలో కూడా పాల్గొన్నారు. అనంతరం కొండడాబాలు వ్యాకుల మాత జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో ఫాదర్ ఎమ్మెల్యే చేత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, చింతల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'చదవడం - మాకిష్టం'

లక్కవరపుకోట : స్థానిక శాఖ గ్రంథాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చదవడం – మాకిష్టం కార్యక్రమం కొనసాగుతుంది. ఇందులో భాగంగా ఆదివారం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులచే నీతి కథలు చదివించారు. చిల్డ్రన్స్ క్లబ్‌లో భాగంగా ఉల్ క్రాఫ్ట్ నేర్పడంతో పాటు క్యారంబోర్డు పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ దామోదర శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలు చెల్లించాలి

బొబ్బిలి : రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ రంగ సంస్థలు, వివిధ శాఖలలో పని చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు, ఉద్యోగ విరమణ చేసిన వారికి సకాలంలో వేతనాలు, పెన్షన్స్ చెల్లించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.శంకరరావు డిమాండ్ చేశారు. సిపిఎం కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు వేతనాలు, పెన్షనర్లకు పెన్షన్స్ సకాలంలో చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతినెల వేతనాలు సకాలంలో చెల్లించడం లేదన్నారు. అద్దెలు చెల్లించుకోలేక, అప్పులకు వడ్డీలు చెల్లించలేక, వైద్యానికి డబ్బులు లేక ఉద్యోగులు, పెన్షనర్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బ్యాంకు రుణాలు తీసుకున్న వారు సకాలంలో రుణాలు చెల్లించకపోవడంతో అధిక వడ్డీలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వ విధానాలు వలనే సకాలంలో వేతనాలు చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు, పెన్షనర్స్ కు సకాలంలో వేతనాలు, పెన్షన్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం చేస్తామన్నారు. ఆయనతో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం, నాయకులు ఎ. సురేష్, మణికుమార్ ఉన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

గుర్ల : నెల్లిమర్ల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గల గుర్ల, నెల్లిమర్ల మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ వర్కర్, హెల్పేర్, మినీ అంగన్వాడీ హెల్పేర్ పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ విడుదలైనట్లు పిఒ సత్యవతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక అంగన్‌వాడీ వర్కర్ పోస్టు, నాలుగు హెల్పర్, ఒక మినీ హెల్పేర్ కలిపి 6 పోస్టులు ఖాళీలు భర్తీకి నోటిఫికేషన్ విడుదలయ్యిందన్నారు. గుర్ల మండలంలో గొర్లిపేట జగన్నాథపురం అంగన్వాడీ కార్యకర్త (ఎస్‌సి), నెల్లిమర్ల మండలం చిన్నబురాడపేట (ఎస్.సి), నారాయనపట్నం (ఎస్‌టి.), గుర్ల మండలంలో మన్యపురిపేట (ఒ.సి.), కలవచర్ల (ఒ.సి.ఓహెచ్), సదానందపురం మినీ అంగన్వాడీ కార్యకర్త (బిసిఈ) కేటగిరీలకు కేటాయించడం జరిగిందన్నారు.

కొత్తవలస: మండలంలో అంగన్వాడి పోస్ట్ భర్తీకి నోటిఫికేషన్ విడుదలైందని వియ్యంపేట ఐసిడిఎస్ పిఒ ఆర్.ఉమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముమ్మనవానిపాలెంలో అంగన్వాడీ కార్యకర్త పోస్ట్ ఎస్‌సికు, కర్రీచిన్నయ్యపాలెంలో అంగన్వాడి హెల్పర్ పోస్ట్ బిసిబికి కేటాయించామన్నారు. ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా శివపార్వతుల కల్యాణం

శృంగవరపుకోట : పట్టణంలోని పుణ్యగిరి కొండపై గల శ్రీ ఉమా కోటిలింగేశ్వర స్వామి దేవాలయంలో శివపార్వతుల కళ్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు పి. మణిశర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాఘ పౌర్ణమి సందర్భంగా వేకుజామున 4గంటల నుంచి ఈవో నాగేంద్ర ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పలమరశెట్టి రామకృష్ణ, ధర్మకర్తల ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం శ్రీ ఉమా కోటిలింగేశ్వర స్వామి కళ్యాణ మహొత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించామన్నారు. ఈ కళ్యాణంలో ఎస్‌కోటకు చెందిన పుణ్యగిరి దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ గార్లపాటి సత్యసాయి, అనురాధ దంపతులు శివపార్వతుల కళ్యాణకర్తలుగా వ్యవహరించారని ఈ పూజలలో వందలాదిగా భక్తులు పాల్గొన్నారనీ అన్నారు. అనంతరం పుణ్యగిరి కొండపై అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు.

ఎక్కడి ధాన్యం అక్కడే..

- నిలిచిపోయిన కొనుగోలు ప్రక్రియ
- ఆందోళనలో రైతులు
- కొనసాగుతున్న దళారుల హవా

ప్రజాశక్తి- వంగర

పగలనక, రాత్రనక కష్టపడి ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని చివరికి అతి కష్టంమీద కల్లాలకు ధాన్యాన్ని చేర్చినా అధికార యంత్రాంగం కొనుగోలుకు ముందుకు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలు మధుపులు పెట్టి పొలం నుంచి కల్లాలకు వరి తరలించి నూర్పుడులు వేసి ధాన్యాన్ని అమ్మకానికి సిద్ధం చేసినా అధికారులు కొనుగోలు చేయకపోవడంపై రైతులు సర్వత్రా విమర్శలు గుప్పిస్తున్నారు. మొదటి దశలో కొన్ని చోట్ల అరకొర కొనుగోలు జరిగినా రెండో దశలో అధికారులు రైతుల వంక చూడటం లేదు. దీంతో తాము పండించిన పంటను ఎవరు కొంటారో లేదో అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

మండలంలో వివిధ గ్రామాలలో రైతులు ఈ ఏడాది ఖరీఫ్ లో సుమారు పదివేల ఎకరాలకు పైబడి వరి సాగు చేశారు. ప్రస్తుతం వివిధ గ్రామాలలో ముమ్మరంగా వరి నూర్పుడు పనులు జరుగుతున్నాయి. అయితే మండలంలో ఈ ఏడాది కొనుగోలు కేంద్రాలు ముందుగానే ప్రారంభించినప్పటికీ ధాన్యం కొనుగోలు మాత్రం ఇప్పటివరకు సగం మాత్రమే అయ్యాయి. ఇంకా కొప్పర, కొండ చాకరాపల్లి వి.వి.ఆర్. పేట, తలగాం, కోనంగిపాడు నీలయ్య వలస తదితర గ్రామాలలో కొంత మంది నూర్పులు చేసి ధాన్యాన్ని అమ్మేందుకు బస్తాలకు ఎత్తి నిల్వ ఉంచారు. కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో మిగిలిన రైతులు వరి నూర్పులు వేసేందుకు భయపడుతున్నారు. ఫలితంగా చాలా మంది రైతుల ధాన్యం ఇంకా పొల్లాల్లోనే ఉన్నాయి. ముందు వేసిన ధాన్యం కొనుగోలు చేస్తే మిగిలిన వరి కంకులను కల్లాలకు తీసుకొద్దామన్న ఆలోచనలో రైతులున్నారు.

నిలిచిన ధాన్యం కొనుగోలు

గత పది రోజులుగా అధికారులు ధాన్యం కొనుగోలు నిలిపివేశారు.


వంగరలో అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన ధాన్యం బస్తాలు

రెండు రోజులు క్రితం తూతూ మంత్రంగా ప్రారంభించినా అది రైతుల వరకూ చేరలేదని తెలిస్తోంది. మిల్లర్లు నేరుగా ధాన్యం తీసుకునే పరిస్థితి కనబడటం లేదు. ఇప్పటికే వారు తీసుకున్న ధాన్యంతో గోదాములు నిండిపోవడంతో వారు కూడా ధాన్యాన్ని తీసుకునేందుకు వెనుకడుగు వేస్తున్నారు. గోదాముల్లో నిల్వ ఉన్న బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించినా అవి అక్కడ లారీలతో ఉండిపోతున్నాయి తప్ప ఆన్‌లోడ్ జరగడం లేదని మిల్లర్ల యజమానులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ధాన్యాన్ని కొంటారా లేదా అనే విషయంపై రైతులు మల్లగుల్లాలు పడుతున్నారు.

కొనసాగుతున్న దళారుల హవా


చాలామంది రైతులు ధాన్యాన్ని నూర్పుడి చేసి అమ్మేందుకు సిద్ధంగా ఉంచడం వీటిని నిల్వ చేసుకునే పరిస్థితి రైతులు వద్ద లేకపోవడంతో పాటు ప్రస్తుతం ధాన్యం కొనుగోలు నిలిచిపోవడం తో ఇదే అదునుగా దళారుల్లో పెద్ద ఎత్తున గ్రామాల్లోకి చొరబడుతున్నారు. ప్రభుత్వం మీ ధాన్యాన్ని మరి కొనుగోలు చేయదని రైతులను బెదిరించి వారి వద్ద ఉన్న ధాన్యాన్ని తక్కువ ధరకు కొల్లగొడుతున్నారు. వాస్తవానికి ప్రభుత్వం బస్తాకు రూ. 2040లు ప్రకటించగా దళారులు రైతుల వద్ద నుంచి రూ. 1200 నుంచి రూ.1500లే ఇచ్చి దోచుకుంటున్నారు. నచ్చితే ఇవ్వండి లేకపోతే లేదు అని మీ ధాన్యాన్ని ప్రభుత్వం మరి కొనదని దళారులు రైతులకు చెబుతున్నట్లు రైతులు బహిరంగంగానే చెబుతున్నారు. ప్రభుత్వం చెప్పిన విధంగా ఆర్‌బికెల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

వంద బస్తాలు సిద్ధంగా ఉన్నాయి ..కొనేవారు లేరు


దేవకివాడ సత్యం నాయుడు. రైతు. వంగర

15 రోజుల క్రితం నూర్పు చేసి బస్తాలలో ధాన్యం వేసి కళ్ళంలోనే నెట్లుగా వేశాను. ఇప్పటివరకు కొనుగోలు చేసే వారు ఎవరూ కనబడలేదు. ఏం చేయాలో తెలియటం లేదు. కల్లంలో ఉన్న 100 బస్తాలకు రాత్రింబవళ్లు కాపలా కాయాల్సి వస్తుంది.

అన్ని గ్రామాలలో కొనుగోలు చేయలేం


బలివాడ గోవిందరావు, సిఎస్‌డిటి వంగర

ప్రస్తుతం వంగర మండలానికి 300 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయాలని జిల్లా అధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు మండలంలో కోనంగిపాడు, కొండచాకరాపల్లి, మద్దు వలస గ్రామాల్లో ముందు కొనుగోలు చేపడుతాం. మిగిలిన గ్రామాలలో తర్వాత చూస్తాం.

గ్రీన్ అంబాసిడర్ల ఆకలి కేకలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని 39 గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్ల కుటుంబాల్లో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వీరికి గత 9 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పైగా వారికి జీతాలిచ్చే బాధ్యతను కనీసం నిధులు లేని పంచాయతీలకు అప్పజెప్పడంతో వారు జీతాలు చెల్లించక మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. వారికిస్తున్న రూ. 6వేలు కూడా సక్రమంగా ఇవ్వకపోవడంతో కుటుంబాలను ఎలా పోషించేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలకు, కార్మికులకు మధ్య తగువులు పెట్టి ప్రభుత్వం చేతులు దులుపుకోవడం సరైంది కాదని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని గ్రీన్ అంబాసిడర్లు బహిరంగంగానే చెబుతున్నారు. గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు 2021లో కనీస వేతనం జీవో నెంబర్ 57 ప్రకారం రూ.10వేలు


ఆందోళన చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు(ఫైల్)

అమలు ప్రకటనలకే పరిమితం అయిందని ఇది ఎక్కడా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాల్లో కార్మికులపై తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారని, ఆరోగ్యం బాగోకపోయినా కనీసం పట్టించుకునే పరిస్థితి లేదని, సెలవులు కూడా ఇచ్చిన పరిస్థితి లేదని, పనికి కావలసిన రిక్షా బండి, ఇతర పనిముట్లు లేకపోయినా పనిచేస్తున్నామని చెబుతున్నారు. ఉద్యోగ భద్రత కల్పించి పిఎఫ్, ఈఎస్‌ఐ అమలు చేయాలని, కార్మికులకు ప్రభుత్వమే గుర్తింపు కార్డు యూనిఫాం ఇవ్వాలని, బకాయి వేతనాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

వేరుశనగ రైతుల గగ్గోలు

ప్రజాశక్తి - కొత్తవలస

జిల్లాలో వేరుశనగ పంట తీవ్రంగా నష్టపోయిందని పంటలకు ప్రభుత్వం ఎకరాకు రూ.20 వేలు నష్ట పరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని నిమ్మలపాలెం గ్రామంలో పర్యటించి ఆదివారం వేరుశన పంటను పరిశీలించారు. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా అమ్మిన వేరుశనగ విత్తనాలు 80 శాతం వరకు నాటలేదని ఆందోళన వ్యక్తం చేశారు. నాసిరకం విత్తనాలు అమ్మడం వల్ల జిల్లాలో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందించిన విత్తనాలలో ప్రతి బస్తాలోనూ మూడు కేజీల వరకు కొబ్బరి రాళ్ళ కలిపేసి అమ్మేశారని తెలిపారు. విత్తనానికి, దుక్కులకు, ఎరువులకు, పెట్టుబడి పెట్టి వేరుశనగ వల్ల ఏదో ఆదాయం వస్తుందని ఆశపడ్డ రైతు తీవ్రంగా నష్టపోవడంతో ఆందోళన చెందుతున్నారన్నారు. నష్టపోయిన రైతుకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేస్తుందని తెలిపారు. ఈ పరిశీలనలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి అప్పారావు, రైతు సంఘం నాయకులు గొంప రామకృష్ణతో పాటు నిమ్మలపాలెం రైతులు పాల్గొన్నారు.


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

లక్కవరపుకోట: రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విక్రయించిన వేరుశనగ విత్తనాలు నకిలీ కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. రాంబాబు ఆరోపించారు. రైతు సంఘం నాయకులతో మండలంలోని లచ్చింపేట గ్రామ పంచాయతీలో గల పరిసర పొలాలలో పర్యటించారు. నష్టపోయిన వేరుశనగ రైతులకు నష్టపరిహారంగా ఎకరాకు రూ. 20 వేలు ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, జి. రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - వేపాడ

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గృహ సారథులు ప్రజలకు తెలియజేయాలని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అధ్యక్షతన గృహ సారథులు, మండల కన్వీనర్లు, గ్రామ వాలంటీర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడి మరోసారి జగన్మోహన్‌రెడ్డిని సిఎంను చేయాలన్నారు. మళ్లీ ప్రభుత్వం రాకపోతే పథకాలన్నీ ఆగిపోతాయన్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త పైల విజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ఎంపిపి డి. సత్యవంతడు, వైసిపి


మాట్లాడుతున్న జిల్లా పరిషత్తు చైర్మన్ శ్రీనివాసరావు

మండల పార్టీ అధ్యక్షులు ఎం. జగన్నాథం, డిసిసి చైర్మన్ వివి. చిన్న రామ నాయుడు, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం. కస్తూరి, నెట్ కేఫ్ చైర్మన్ పద్మావతి, వైయస్సార్ మండల యూత్ కన్వీనర్ బోజంకి శ్రీను, మహిళా అధ్యక్షులు కర్రీ యశోద, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి అందరికీ తెలియాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలందరికీ సోషల్ మీడియా ద్వారా తెలియజేయాలని స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఆదివారం పట్టణంలోని వైసిపి కార్యాలయయంలో నియోజకవర్గ సోషల్ మీడియా వారియర్స్‌తో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం కొన్ని పత్రికలు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పి కొట్టాలంటే సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వాస్తవాలను తెలియజేయాల్సిన బాధ్యత సోషల్ మీడియా వారియర్స్ పై ఉందన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకుని ప్రచారానికి శ్రీకారం చుట్టాలన్నారు. సోషల్ మీడియా ప్రతినిధులకు తన సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, బొబ్బిలి నియోజకవర్గ వైసిపి యువ నాయకులు శంబంగి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ఠ

పాత బొబ్బిలి జంక్షన్‌లో నూతనంగా నిర్మించిన అభయ ఆంజనేయ స్వామి ప్రతిష్ఠ మహోత్సవంలో ఆదివారం ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, 1వ వార్డ్ కౌన్సిలర్ చోడగంజి రమేష్ నాయుడు, మాజీ కౌన్సిలర్ చోడగంజి సత్యవతి, అడ్వకేట్ రుంకాన ప్రసాద్ తదితరులున్నారు.

సమస్యలు తెలుసుకోవడానికే సమావేశం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో ఉన్న సమస్యలను తెలుసుకోవడానికే ఈ సమావేశం ఏర్పాట చేశామని టిడిపి నియోజకవర్గం నాయకులు గొంప కృష్ణ అన్నారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో తన నివాసం కృష్ణరాయుడుపేటలోని ఆదివారం టిడిపి ఆత్మీయకలయిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గొంప కృష్ణ మాట్లాడుతూ తాను కృష్ణరాయుడుపేట పంచాయతీ పరిధిలోని అంకజోస్యలపాలెం గ్రామానికి చెందినవాడినేనని చెప్పారు. గ్రామాల్లో పర్యటించే ముందు అక్కడున్న సమస్యలను తెలుసుకునేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. అధిష్ఠానం ఎవరికి ఎమ్మెల్యే టికెట్ ఇస్తే వారి విజయానికి తన సాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు గుమ్మడి భారతి, లెంక శ్రీను, జనపరెడ్డి ఈశ్వరరావు, ముక్క రామకృష్ణ,


మాట్లాడుతున్న గొంప కృష్ణ

సిరికి రమణ, ఐటిడిపి అధ్యక్షుడు సేనాపతి గణేష్, సేనాపతి అప్పారావు, మంచిన అప్పలసూరి, సిరికి సూర్యనారాయణ, ఇస్సరాపు కృష్ణ, కొటాను అర్జున, నర్సిపల్లి రమణ, గుర్రపోటు రమణ, గొర్లె నాగరాజు, ఎన్. వెంకటరావు, కామేష్, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలతో ప్రజలకు నష్టం

వేపాడ : ప్రభుత్వ విధానాలతో ప్రజలకు నష్టం జరుగుతోందని టిడిపి నియోజకవర్గ నాయకులు గొంప కృష్ణ అన్నారు. మండలంలోని వేపాడ, వల్లంపూడి గ్రామాల్లో ఆదివారం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి సిఎం అయిన తరువాత రాష్ట్రంలోకి పరిశ్రమలు రాలేదని ఉన్న పరిశ్రమలు పోయాయని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం టిడిపి మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతి, ఐటిడిపి అధ్యక్షుడు సేనాపతి గణేష్, మండల తెలుగు యువత కమిటీ సభ్యులు, గ్రామ కమిటీ తెలుగుదేశం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, మాజీ సర్పంచులు, టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో ప్రతిభ

శృంగవరపుకోట : కడప జిల్లా ప్రొద్దుటూరులో ఈనెల 2వ తేదీ నుండి 5వ తేదీ ఆదివారం వరకు జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ బాడ్మింటన్ పోటీలలో జిల్లాకు చెందిన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని పోటీలకు న్యాయనిర్ణీతగా వ్యవహరించిన చిన పొట్నూరు శ్రీరాములు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35ప్లస్ విభాగంలో మొహమ్మద్ ఖాళీలుల్ల (ద్వితీయ), 40ప్లస్ విభాగంలో ఎమ్.శ్రీను (ద్వితీయ), స్థానాలు సాధించారన్నారు. వీరు మార్చిలో జరగబోవు జాతీయ స్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ టీమ్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని శ్రీరాములు తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా బ్యాడ్మింటన్ అసోషియేషన్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, డాక్టర్ వి.ఎస్. ప్రసాద్, ఎమ్.కె.బి శ్రీను, కార్యదర్శి కుసుమ బచ్చన్, నున్న సురేష్, ఫోన్ ద్వారా అభినందించారు.

ఢిల్లీ ర్యాలీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - వంగర

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీలో నిర్వహించనున్న మజ్దూర్ కిసాన్ ఏక్తా ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్. రామ్మూర్తినాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు రాజాంలో సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి మోడీ కార్మికుల జీవన విధానంపై దాడి తీవ్రతరం చేసిందని, కార్పొరేట్ల కోసం పర్మినెంట్ ఎంప్లాయ్మెంట్ స్థానంలో అప్రెంటీస్, ట్రైనీ పని విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. బిజెపి ప్రభుత్వ విధానాలతో పాటు కరోనా వల్ల 80శాతం కార్మికుల జీవన ప్రమాణాలు పడిపోయాయని, ప్రభుత్వ రంగ సంస్థలను బిజెపి ఒక్కొక్కటిగా అమ్మేసే పని పెట్టుకుందని అన్నారు. కార్మిక వర్గం అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న చట్టాలను లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను కట్టు బానిసలుగా చేసే ప్రయత్నం చేసిందని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు ప్రతి బడ్జెట్లోనూ నిధులు కేటాయింపులు తగ్గిస్తూ వస్తుందని అన్నారు. వీటన్నింటికి వ్యతిరేంగా చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో శ్రీనివాసరావు, సత్యారావు, సురేష్, ఆదియా, ప్రసాదు, లక్ష్మణరావు, రమణ పాల్గొన్నారు.

రాష్ట్రానికి అధిక కేటాయింపులు

నెల్లిమర్ల : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి అధిక నిధులు కేటాయించిందని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బూర్లే శ్రీధర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రానికి అధిక నిధులు కేటాయించిందన్నారు. ముఖ్యంగా ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్రానికి సెంట్రల్ యూనివర్సిటీ, పెట్రోలియం, గిరిజన యూనివర్శిటీలతో బాటు విశాఖ స్టీల్ ప్లాంట్‌కి వందల కోట్ల రూపాయలు కేటాయించిందని తెలిపారు. 2009–14లోఅప్పటి ప్రభుత్వం రైల్వే అభివృద్ధికి రూ.886 కోట్లు కేటాయించగా బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.840కోట్లు ప్రస్తుత బడ్జెట్‌తో కలిపి 9సార్లు కేటాయించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 72 రైల్వే స్టేషన్లు ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేయడానికి అమృత్ భారత్ స్టేషన్ పథకం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. దీనిలో భాగంగా విశాఖకు రూ. 446కోట్లు, నెల్లూరుకు రూ. 103కోట్లు, తిరుపతికి రూ. 313 కోట్లతో ఆయా స్టేషన్ల పరిధిలో అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. కాగా బడ్జెట్ కేటాయింపులో కేంద్ర ప్రభుత్వంపై ప్రతి పక్షాలు తప్పుడు ప్రచారం చేయడం సమంజసం కాదన్నారు.

వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తవలస

మండలం లోని తుమ్మికాపల్లిలోని వినాయక నగర్‌లో ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్ ఆధ్వర్యంలో 35 మంది నిరుపేద వంటరి వృద్ధులకు 12 రకాల నిత్యవసర సరుకులను ఆదివారం పంపిణీ చేవారు. రైల్వే విశ్రాంత ఉద్యోగి రమణ, రైల్వే ఉద్యోగి గోకాడ శ్రీను, కొత్తవలస జనసేన మండల పార్టీ అధ్యక్షుడు నక్కరాజు సతీష్ పాల్గొని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ట్రస్టులో మెంబెర్స్‌గా చేరి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఇటువంటి సేవా కారక్రమాలు మనసకు తృప్తిని ఇస్తాయన్నారు. ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ్ హరికుమార్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో సేవా కార్యక్రమాలు మరింత ముందుకు తీసుకెళ్తామని ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించడంతో పాటు ట్రస్ట్‌లో మెంబర్స్‌గా చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ శ్రావణ్ కుమార్, ట్రస్ట్ సభ్యులు గణేష్, నగేష్, గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రలో బేబినాయన

బొబ్బిలి : టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో బొబ్బిలి టిడిపి నియోజకవర్గ ఇంచార్జీ బేబినాయన ఆదివారం పాల్గొన్నారు. కాణిపాకం వద్ద జరిగిన పాదయాత్రలో లోకేష్‌ను బేబినాయన కలిసి పాదయాత్రలో లోకేష్‌తో అడుగులు వేశారు. బొబ్బిలి రాజకీయ పరిస్థితులపై ఇద్దరు చర్చించారు. బొబ్బిలిలో టిడిపి జెండా ఎగర వేస్తామని బేబినాయన లోకేష్‌తో అన్నట్లు టిడిపి కార్యకర్తలు చెపుతున్నారు.


లోకేష్‌తో బేబినాయన

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

పూసపాటిరేగ : మండలంలోని కుమిలి, రెల్లివలస రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమిలికి చెందిన కురిమి వెంకటేష్ (16), గేదెల పైడినాయుడు (25) మృతి చెందారు. వీరిద్దరు ద్విచక్రవాహనాలపై ఆదివారం ఉదయం రెల్లివలస నుండి కుమిలి వైపు


మృతి చెందిన వెంకటేష్

వెలుతూ ఎదురెదురుగా డీకొన్నారు. ఈ ప్రమాదంలో వెంకటేష్ అక్కడక్కడే మృతి చెందగా పైడినాయుడుకు తీవ్ర గాయాలవడంతో విజయనగరం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పైడినాయుడు మృతి చెందాడు. పూసపాటిరేగ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు ఎకరాల్లో నీలగిరి తోట దగ్ధం

లక్కవరపుకోట : మండలంలోని చందులూరు గ్రామ పంచాయతీ సమీపంలో మూడు ఎకరాల నీలగిరి తోట ఆదివారం దగ్ధమై రూ. 1.5 లక్షలు నష్టం వాటిల్లింది. ఎస్‌కోట అగ్నిమాపక అధికారులు షేక్ మదీనా తెలిపిన వివరాల ప్రకారం. చందులూరు గ్రామానికి చెందిన రైతు జి. నాగేశ్వరరావుకు ఉన్న 20 ఎకరాల నీలగిరి తోటలో గుర్తుతెలియని వ్యక్తులు మద్యం సేవించి నిర్లక్ష్యంగా దూమపానం చేయడం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్ కోట అగ్నిమాపకటం సంఘటన స్థలానికి చేరుకునే సరికి పూర్తిగా మూడు ఎకరాలు దగ్ధమైంది. అప్రమత్తమైన అధికారులు మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారులు కే గౌరీశ్వరరావు, అనిల్ కుమార్ వర్మ, ఎర్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.